క్లుప్తంగా

ప్రాంగణ నియామకాల్లో సత్తా



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

తాడిపత్రి: ప్రముఖ కార్ల కంపెనీ కియాకు అనుబంధంగా ఉన్న కేఎస్‌హెచ్ ఆటోమోటివ్స్ ఇటీవల నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ తెలిపారు. సోమవారం ఉద్యోగాలు సాధించిన 40 మంది విద్యార్థులను శాఖాధిపతులు కార్తికేయ శర్మ, మద్దయ్య, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సునిల్ కుమార్ అభినందించారు. ఇటీవల అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన జాబ్ మేళాలో సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థి పవన్ కుమార్ ఎల్అండ్‌టీ కంపెనీలో ఉద్యోగం సాధించాడని సివిల్ ఇంజినీరింగ్ శాఖాధిపతి వీరాస్వామి తెలిపారు.

వడ్డీ లేకుండా ఆస్తి పన్ను చెల్లించండి

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఆస్తి పన్ను చెల్లింపుదారులు మొదటి అర్ధ సంవత్సర ఆస్తి పన్నును ఈనెల 30వ తేదీలోపు ఎలాంటి వడ్డీ లేకుండా చెల్లించాలని మున్సిపల్ రెవెన్యూ అధికారి నాసిర్‌హుసేన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఆఫీసు కౌంటర్ లేదా (సీడీఎంఏ వెబ్‌సైట్) ఆన్‌లైన్‌లో ఆస్తి పన్ను చెల్లించవచ్చని తెలియజేశారు.

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏఓ స్వాతి

గుంతకల్లు రూరల్: ఫర్టిలైజర్ షాపుల్లో నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల అగ్రికల్చర్ ఆఫీసర్ స్వాతి డీలర్లను హెచ్చరించారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డులోని ఆర్బీకే సెంటర్‌లో మండలంలోని ఫర్టిలైజర్ షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫర్టిలైజర్ షాపుల్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని సూచించారు. నిర్దేశించిన ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విక్రయాలు చేపట్టాలని ఆదేశించారు. కొనుగోలుదారులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. షాపులు కూడా సీజ్ చేస్తామని హెచ్చరించారు.

బకాయిలు చెల్లించాలని వినతి

గుంతకల్లుటౌన్: ఆర్టీసీ ఉద్యోగులకు గత యేడాది జనవరి నుంచి ఆగస్టు వరకూ రావాల్సిన పీఆర్‌సీ బకాయిలను చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని ఉపఖజానా అధికారి సుధాకర్‌ను ఏపీపీటీడీ ఎన్ఎంయూ నాయకులు కోరారు. సోమవారం ఎన్ఎంయూ డిపో కార్యదర్శి నటరాజ్, నాయకుడు నటరాజ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. జీఓ 113 ప్రకారం బకాయిలు చెల్లించాలని కోరారు.

గొడవలకు వెళ్తే మండల బహిష్కరణ



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ రామకృష్ణ

యల్లనూరు: పల్లెల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. సోమవారం మండల వ్యాప్తంగా ఉన్న 35 మంది రౌడీ షీటర్లకు స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. 35 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేశామన్నారు. ఇకపై పల్లెల్లో ఎలాంటి గొడవలకు వెళ్లొద్దని సూచించారు. గొడవలకు పాల్పడినా, ప్రోత్సహించినా మండలం నుంచి బహిష్కరిస్తామన్నారు. అలాగే పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సంపత్‌కుమార్, కానిస్టేబుళ్లు నాగరాజు, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌తో ఉద్యోగ అవకాశాలు మెండు



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో కళాశాల నిర్వాహకులు

గుంతకల్లు రూరల్: ఇంటర్న్‌షిప్ చేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని ఎస్ఎస్‌జీఎస్ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీశంకరానందగిరీ డిగ్రీ కళాశాలలో బజాజ్ ఫిన్ సర్వ్ సంస్థ ఆధ్వర్యంలో దాదాపు 100 మంది విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ అంశాలపై నాలుగు నెలల పాటు శిక్షణ ఇచ్చారు. సోమవారం శిక్షణ పూర్తి కావడంతో విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపాల్, కరస్పాండెంట్ హరి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యేలు వై.వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి



గుత్తి రూరల్: బుక్‌లెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి



రావులుడికిలో పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

గుత్తి రూరల్: ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొత్తపేట, ఎంగిలిబండ గ్రామాల్లో వైస్ ఎంపీపీ తిరుపాలమ్మ, సర్పంచ్ గురు మస్తాన్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు రాముయాదవ్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతి రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. పేద ప్రజల అభివృద్ధి కోసమే సీఎం జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల్లోకి పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధికి జగనన్న పాటుపడుతున్నారన్నారు. 2024 ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా సంక్షేమ ఫలాలను పేదలకు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ విశాలాక్షి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వరలక్ష్మి, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఈఓఆర్డీ శివారెడ్డి, ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు శ్రీకుమార్, మంజునాథ్, మహేష్ నాయక్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు బేడల వెంకటరాముడు, సుభాష్‌రెడ్డి, ఎన్‌సీ రంగయ్య, రాజన్న, సుధాకర్ యాదవ్, మల్లయ్య, సునీల్ కుమార్, లాలు నాయక్, అబ్దుల్ వహాబ్, పుల్లారెడ్డి, రమణ, ప్రకాష్, ఓబులప్ప, కౌన్సిలర్లు వరదరాజులు, ఫారూక్, వాల్మీకి శివ, రమణ, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సునీల్ యాదవ్ పాల్గొన్నారు.

జగన్‌ను ఆశీర్వదించాలి..

పెద్దవడుగూరు: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రావులుడికి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. పథకాల లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. సమస్యలను పరిష్కరిస్తూ గ్రామ స్వరాజ్యం దిశగా ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వం నడుస్తోందని అన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకుని, వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ, సీసీ రోడ్లు వేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మరొకసారి సీఎం జగన్‌ను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగభూషణ, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్, ఎమ్మెల్యే కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పాశం రంగస్వామి, తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్మన్ హరినాథరెడ్డి, యువజన విభాగం కన్వీనర్ కృష్ణారెడ్డి, అనంతపురం పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, బీసీ విభాగం నాయకుడు వెంకటస్వామి గౌడ్, శేషారెడ్డి, దస్తగిరి, వేణుగోపాల్ యాదవ్, మద్దిలేటి, సర్పంచ్ రంగేశ్వరెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీరంగారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, చిన్నవడుగూరు మధు, రామ్మోహన్ యాదవ్, రామాంజినేయులు, సాంబశివారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, పుట్లూరు కృష్ణారెడ్డి, సుంకన్న, నాగరాజు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

తాడిపత్రి టౌన్: స్థానిక ప్రభుత్వాస్పత్రి పాలెంలో మంగళవారం ఉదయం 7:30 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్కేపీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు సత్కారం

గుంతకల్లు రూరల్: స్థానిక ఎస్కేపీ డిగ్రీ కళాశాలకు న్యాక్ బృందం ఏ గ్రేడ్ గుర్తింపునిచ్చింది. ఇటీవల న్యాక్ బృందం కళాశాలలో పర్యటించిన విషయం తెలిసిందే. కళాశాల నిర్వహణ, ల్యాబ్, తరగతి గదులు, విద్యా బోధనను క్షుణ్ణంగా పరిశీలించింది. కళాశాలకు ఏ గ్రేడ్ గుర్తింపును మంజూరు చేసింది. కళాశాలకు న్యాక్ గుర్తింపు రావడంలో కీలకపాత్ర పోషించిన ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్‌ను సోమవారం మార్నింగ్ వాకర్స్ సభ్యులు ఘనంగా సత్కరించారు. అలాగే అధ్యాపకులకు అభినందనలు తెలియజేశారు.

విద్యార్థి అదృశ్యం



హరీష్

పెద్దవడుగూరు: మండల పరిధిలోని జి.వెంకటాంపల్లి గ్రామానికి చెందిన సిద్ధపు చంద్రశేఖర్ కుమారుడు హరీష్ ఈనెల 24 నుంచి అదృశ్యమైనట్లు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పది పరీక్షల్లో ఒక సబ్జెక్ట్ ఫెయిల్ కావడంతో తన కుమారుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడని తండ్రి చంద్రశేఖర్ తెలిపారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు



మినరల్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పంచాయతీ అధికారులకు సూచించారు. సోమవారం మండలంలోని రాయలచెరువు ఉన్నత పాఠశాల సమీపంలో రూ.4.80 లక్షల మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన బోరును ప్రారంభించారు. అలాగే అర్చకుడు హరికృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల ఎదుట మినరల్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కొన్నేళ్లుగా మండలంలోని రాయలచెరువులోని ఉన్నత పాఠశాల, స్టేట్‌బ్యాంకు వీధి, చందన గేట్ వద్ద ఉన్న గృహాలకు నీటి సమస్య ఉంది. ఈ విషయానిన సర్పంచ్ తలారి అరుణ, వైస్ ఎంపీపీ హసీనా బేగం, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేష్, రషీద్, మండల జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట రామిరెడ్డి తదితరులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే మండల పరిషత్ నిధులతో బోరు వేయించారు. తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. వైస్ ఎంపీపీ చెన్నప్ప, స్థానిక నాయకులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు అరుణ్ కుమార్, రామిరెడ్డి, తాడిపత్రి మార్కెట్ యార్డ్ చైర్మన్ హరినాథ్ రెడ్డి, పెద్దవడుగూరు వైస్ ఎంపీపీ హరినాథరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, కోనా వెంకట శివారెడ్డి, ఉపేంద్రగౌడ్, ఆదినారాయణ రెడ్డి, రవికాంత్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని

గుంతకల్లుటౌన్: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పట్టణంలో పర్యటించినప్పుడు ఆయా వార్డుల్లో ప్రజా అవసరాల నిమిత్తం గుర్తించిన అత్యవసరమైన పనులను చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదించింది. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. జర్నలిస్టు కాలనీ వద్ద ఉన్న డాక్టర్ వైఎస్సార్ పార్క్‌లో స్ట్రీట్ లైటింగ్, అంజలినగర్ పార్క్‌లో కొరియన్ కార్పెట్ గడ్డి పరిచడంతో పాటు స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటుకు కౌన్సిల్ తీర్మానం చేసింది. అలాగే ఆలూరు రోడ్ బస్టాప్ నుంచి జి.కొట్టాల గ్రామ జీఎస్‌బీసీ కెనాల్ బ్రిడ్జి వరకూ విద్యుత్ స్తంభాలు, హెచ్‌టీ లైన్, స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటుకు సాధారణ నిధుల నుంచి రూ.23 లక్షలు ఖర్చు చేసేందుకు ఆమోదించింది. కౌన్సిలర్లు మాణిక్యం, కృపాకర్, కో-ఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్‌మాబు మాట్లాడుతూ.. పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుధ్యం లోపించిందన్నారు. పలువురు శానిటేషన్ సెక్రెటరీల పనితీరు సరిగ్గా లేదన్నారు. డివిజన్‌కో శానిటరీ మేస్త్రీలను నియమించాలని కోరారు. వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, అసిస్టెంట్ కమిషనర్ లావణ్య, ఎంఈఈ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి చర్యలు

నాయీబ్రాహ్మణ కాలనీలో కమ్యూనిటీ హాల్‌కు రూ.10 లక్షలు, వడ్డెర కళ్యాణ మండపానికి రూ.5 లక్షలు, 7వ వార్డులోని కమ్యూనిటి హాల్‌కు రూ.5 లక్షలు, తిమ్మనచెర్ల రైల్వేస్టేషన్ మసీదు వద్ద ముస్లింల కమ్యూనిటీ హాల్‌కు రూ.8 లక్షలు, ఎంపీ ల్యాడ్స్ రూ.20 లక్షలతో పాతగుంతకల్లులోని వాల్మీకి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదించింది.

సంక్షిప్త సమాచారం

దాడి ఘటనలో ఇద్దరి అరెస్ట్

యాడికి: ఈనెల 19వ తేదీన మండలంలోని కేశవరాయుని పేటలో రెండు వర్గాలు పరస్పరం దాడి చేసుకున్న సంగతి తెలిసిందే. బాధితులు నాగన్న, ఎర్ర ఓబులేసు ఫిర్యాదు మేరకు నాగమ్మ, నగేష్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు.

ప్రైవేటు స్కూల్ బస్సుల పరిశీలన

పెద్దవడుగూరు: మండలంలోని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు నడుపుతున్న బస్సులను సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు సోమవారం పరిశీలించారు. డ్రైవర్లు తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. బస్సు కెపాసిటీకి మించి పిల్లలను ఎక్కించుకుంటే చర్యలు తప్పవన్నారు.

'స్పందన'కు ఒక వినతి

యల్లనూరు: తమ భూమి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వేములపల్లికి చెందిన ఓ రైతు స్పందనలో తహసీల్దార్ సుమతికి వినతిపత్రం అందజేశాడు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఒక్క అర్జీ వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్, గృహ నిర్మాణశాఖ ఏఈ సుప్రజ, మండల ఇంజనీరు నరేంద్ర, ఆరోగ్య పర్యవేక్షకులు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి

గార్లదిన్నె: నాడు-నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని ఎంఈఓ-2 వెంకటరమణ నాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మర్తాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందు కోసం మాస్టార్ ప్లాన్ తయారు చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జయరాం, సర్పంచు వరలక్ష్మి, పాఠశాల చైర్మన్ హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

తాడిపత్రి టౌన్: పౌర్ణమిని పురస్కరించుకుని తాడిపత్రి నుంచి అరుణాచలం పుణ్యక్షేత్రానికి జూలై 2వ తేదీన ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు డిపో మేనేజర్ శంకర్ సోమవారం తెలిపారు. తాడిపత్రి బస్టాండ్‌లో 2వ తేదీ ఉదయం 8 గంటలకు బస్సు బయలు దేరుతుందన్నారు. రానుపోను చార్జీలు పెద్దలకు రూ.1,430, పిల్లలకు రూ.750 చొప్పున నిర్ణయించినట్లు తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

శింగనమల: రైతులు పండించిన పంటను నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం వ్యవసాయ గిడ్డంగులు (గోడౌన్లు) నిర్మిస్తోందని డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక రాచేపల్లి రోడ్డులో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.82 లక్షలతో వ్యవసాయ గోడౌన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, వాటి ద్వారా విత్తనాలు, ఎరువులు, డ్రిప్పు, స్ప్రింక్లర్లు, పంటల నమోదుకు చర్యలు తీసుకుందని తెలిపారు. పంటలు నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరు రమణారెడ్డి, సీఈఓ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ ఒడి'కి ఈ-కేవైసీ తప్పనిసరి

యాడికి: అమ్మ ఒడి పథకం సాయం పొందేందుకు విద్యార్థి, తల్లి ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల విద్యాధికారులు కాశెప్ప, ధనలక్ష్మి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని నం:1 ప్రాథమిక పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. ఈనెల 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 1వ తరగతి నుంచి ఇంటర్ చదవుతున్న విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి అమ్మఒడి సాయం జమ చేస్తారన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

బుక్కరాయసముద్రం: మండలంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని సీఐ నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 21 మందిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోండి

తాడిపత్రి: పట్టణ, మండల ప్రాంతాల్లో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించినా ఇక్కడి విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఏబీవీపీ నాయకులు అన్నారు. సోమవారం వారు స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలుకు వినతిపత్రం అందజేశారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అఖిల్ కుమార్‌రెడ్డి, ఏబీవీపీ నగర ఉపాధ్యక్షుడు మనోజ్ పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే చేపట్టండి



వివరాలు తెలుసుకుంటున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కృష్ణానాయక్

గుంతకల్లు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ రాము, ఎంపీడీఓ వెంకటరమణప్ప, ఈఓఆర్డీ బారన్ సాహెబ్ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించాలన్నారు. అర్హత ఉండి ఏదైనా కారణం చేత సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే అందించాలన్నారు. వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు తదితర వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వం 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఒకే రోజులో అక్కడికక్కడే ఉచితంగా పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలన్నారు.

గార్లదిన్నె: ప్రతి ఇంట్లో ఏ చిన్న సమస్య ఉన్న పరిష్కరించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందని ఎంపీడీఓ తేజోత్స్న పేర్కొన్నారు. తహసీల్దార్, ఈఓపీఆర్డీ, ఒక జట్టుగా.. ఎంపీడీఓ సీఎస్‌డీటీ రెండో జట్టుగా ఏర్పడి జూలై 1నుంచి సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తామన్నారు. అక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అలాగే సేవా చార్జీలు లేకుండానే అవసరమైన సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. క్యాంపులకు వారం రోజుల ముందుగా ఆయా గ్రామ సచివాలయ పరిధిలోని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకోవాలన్నారు.

జగనన్న సురక్ష షెడ్యూల్ విడుదల

జూలై 1న గార్లదిన్నె-1, గార్లదిన్నె-2, 4న కల్లూరు-1, కల్లూరు-2, 6న మర్తాడు-1, మర్తాడు-2, 11వ తేదీ కోటంక, కేశవాపురం, 13వ తేదీ యర్రగుంట్ల ,శిరివరం, 15వ తేదీ పెనకచెర్ల, బూదేడు, 18న కమలాపురం, కనంపల్లి, 20న కల్లూరు-3, ఇల్లూరులో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అర్హులకు పథకాలు అందించాలి..

బుక్కరాయసముద్రం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందించేందుకు కృషి చేయాలని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కృష్ణానాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను పరిశీలించారు. మండలంలో ఉన్న సచివాలయాలు? పని చేస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా కారణంలో పథకాలు అందకపోతే వెంటనే అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవాలన్నారు. ఉచితంగా సర్టిఫికెట్లు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ భాస్కర్, సర్పంచ్ పార్వతి, ఈఓఆర్డీ దామోదరమ్మ, పంచాయతీ సెక్రటరీ సాధిక్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పామిడి: జూలై 1వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ డి.ప్రభాకర్ నాయక్ తెలిపారు. సచివాలయాల ద్వారా 11 రకాల సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందన్నారు.

పుట్లూరు: జగనన్న సురక్ష కార్యక్రమం కింద వలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించి సమస్యలు తెలుసుకోవాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి, తహసీల్దార్ మోహన్‌కుమార్ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో కడవకల్లు, దోశలేడు సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి: మద్యం కోసం కట్టుకున్న భార్య డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఆలూరులో సోమవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. పెద్దయ్య (37) ఆటో నడుపుతూ భార్య వరలక్ష్మి, ఇద్దరు ఇరువురు పిల్లలతో కలిసి జీవనం సాగించేవాడు. భార్య సమీపంలోని సజ్జలదిన్నెలో సిమెంట్ పెల్లల పరిశ్రమలో కూలీగా పని చేసేది. తాగుడుకు బానిసైన పెద్దయ్య ఆటో నడపగా వచ్చిన డబ్బులను పూర్తిగా మద్యానికి ఖర్చు చేసేవాడు. భార్య సంపాదించే డబ్బులను లాక్కెళ్లి మద్యం సేవించేవాడు. సోమవారం పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చిన పెద్దయ్య డబ్బుల కోసం ఇంట్లో అన్ని చోట్లా వెతికాడు. చివరకు డబ్బుల కోసం భార్య వరలక్ష్మికి ఫోన్ చేశాడు. తన వద్ద డబ్బులు లేవని, మద్యం అలవాటు ఇప్పటికైనా మానుకోవాలని భార్య వరలక్ష్మి సూచించింది. కోపంతో పెద్దయ్య ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోలీసుల అదుపులో గుప్త నిధుల వేటగాళ్లు

గుత్తి: ఈనెల 4వ తేదీన కొంత మంది వ్యక్తులు గుత్తి కోటలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతుండగా ఆర్క్యాలజీ సిబ్బంది సమాచారంతో పోలీసులు దాడి చేశారు. 9 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న విషయం తెలిసిందే. అయితే ఆ రోజు ముగ్గురు పరారీ అయ్యారు. ఈ క్రమంలో పోలీసులు సోమవారం వనపర్తికి వెళ్లి అక్కడ గుప్త నిధుల తవ్వకం దారులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరు వాడుతున్న స్కార్పియో వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ ఘటనపై పోలీసుల దర్యాప్తు చేపట్టారు.

10 గొర్రెల అపహరణ

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని చాకలి రాజు అనే వ్యక్తి చెందిన 10 గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 22న సాయంత్రం చాకలి రాజు తన పొలంలో గొర్రెలను దొడ్డిలోకి వదిలి, ఇంటికెళ్లాడు. మరుసటి రోజు ఉదయం వెళ్లి చూడగా కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో కూలీ మృతి

తాడిపత్రి: పట్టణంలోని సాయిబాబా గుడి సమీపంలో ఇంటి నిర్మాణ పనులకు వచ్చిన ఓ కూలీ ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. వివరాలు.. ఓం శాంతి నగర్‌కు చెందిన నబీరసూల్ (45) ఇంటి పనులు చేసేందుకు కూలీగా వెళ్లేవాడు. సోమవారం మేస్త్రీ జానకిరాముడు వద్ద పనికి వెళ్లిన నబీరసూల్ నూతన ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా కింద నుంచి ఐరన్ పైపును ఇంటి పై ఫ్లోర్‌కు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగలకు ఇనుప పైపు ప్రమాదవశాత్తూ తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ సంఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య మాబ్బీ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు

గుంతకల్లుటౌన్/గుత్తి/బుక్కరాయసముద్రం/పామిడి:గుంతకల్లు రూరల్: మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు చోటుచేసుకుంటాయని ప్రగతి మైత్రి మహిళా సంఘం పీడీ నూర్జహాన్, మేనేజర్ రమేష్ తెలిపారు. సోమవారం గుంతకల్లు పట్టణంలో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. గుత్తిలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నుంచి గాంధీ సర్కిల్ మీదగా తాడిపత్రి రోడ్డులోని శ్రీసాయి జూనియర్ కాలేజీ వరకూ ర్యాలీ చేపట్టారు. కమ్యూనిటీ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, సెబ్ సీఐ వరలక్ష్మి పాల్గొన్నారు. బుక్కరాయ సముద్రం మండల కేంద్రంలో సీఐ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. పామిడిలో టీసీ హైస్కూల్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఆ యూనిట్ అధికారి రామాంజనేయులు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ చేపట్టారు. యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని గుంతకల్లు జేఎఫ్‌సీఎం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మంజుల సూచించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక దోనిముక్కల రోడ్డు సమీపంలోని బీసీ బాయ్స్ హాస్టల్‌లో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

కుష్టు నిర్మూలనకు చర్యలు



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎంపీపీ సునీత

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వ కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు.

గార్లదిన్నె: కుష్టు వ్యాధి గుర్తించడంలో వైద్య సిబ్బంది అంకిత భావంతో పని చేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ షమీన్‌తాజ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో కుష్టు వ్యాధి గుర్తింపుపై అవగాహన నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు.

ఖరీఫ్ పంటల బీమా ప్రకటించాలి

గుంతకల్లు రూరల్: అతివృష్టి, అనావృష్టి కారణంగా గతేడాది ఖరీఫ్‌లో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు వెంటనే పంటల బీమా ప్రకటించాలని రాష్ట్ర రైతు సంఘం నాయకులు కోరారు. సోమవారం వారు తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు మాట్లాడారు. ఎంటల బీమా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు.

తాడిపత్రి: అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలకు బీమా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. సోమవారం తహసీల్దార్ మునివేలుకు వినతిపత్రం అందజేశారు.

గార్లదిన్నె: గతేడాదికి సంబంధించిన పంటల బీమా వెంటనే ప్రకటించాలని ఏపీ రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఓ సోమశేఖర్‌కు అందించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, మండల కార్యదర్శి నల్లప్ప, చెన్నారెడ్డి పాల్గొన్నారు.